# నేటి కుచేలరావు కథ!

కుచేల్‌రావ్ పేరుగల పెద్దమనిషి. గవర్నమెంట్ ఆఫీసులో ఎల్డీసీ! అతను బ్రహ్మచారి! పెళ్లీ పేటాకులు వద్దనుకున్నాడు. (ఇక పిల్లలెక్కడి నుంచి వస్తారు?)

ఇదే పేరెంట్స్ చేసే పెద్ద (క్షమించరాని) పొరపాటు. పెద్దయ్యాక కదా ఎవరు ఎటువంటివాడో తెలిసేది! అంత వరకూ ఆగలేక పిల్లాడు పుట్టగానే సంబరపడి ఇరవై ఒకటో రోజు బారసాల వేడుక జరిపి బంధుజనాన్ని పిల్చి విందు భోజనం ఏర్పాటు చేసి కన్నవారికిష్టమైన పేరేదో పసివాడికి తగిలిస్తారు. రాముడని పేరు పెడితే వాడు దుష్టుడు కావచ్చు. హరిశ్చంద్రుడని పేరు పెడితే వాడు అబద్ధాల కోరు కావచ్చు! పెరిగి పెద్దయ్యాక!

అదే విధంగా కుచేలరావు అనబడే బడుద్దాయికి వాళ్ల అమ్మానాన్న బారసాలనాడు పళ్లెంలో బియ్యం పోసి బంగారు ఉంగరంతో పేరు దానిపై రాయించేసి పల్లికిలించేశారు.

కాని మనవాడు సార్థకనామధేయుడు కాదే!!? అదే వాడి పేరుతో వచ్చిన చిక్కు!

పేరెంట్స్ తనకు కుచేలరావ్ అని పేరు పెట్టినందుకు గునుస్తూనే వున్నాడు. వాళ్లతో ఘర్షణ పడని రోజంటూలేదు.

లేకపోతే ఏంటీ? ప్రతి సన్నాసీ ప్రశ్నించేవాడే!... పెళ్లయిందా? పిల్లలెంతమంది అని?

అడిగే ప్రతివాడికి పెళ్లికాలేదు మహాప్రభో! అని జవాబు ఇవ్వలేక చావుకొస్తోంది. పెళ్లింకా కాలేదంటూ కుచేలరావు ఇచ్చే జవాబు విన్న వారు అతగాడి మొహాన కాండ్రించి ఉమ్మినట్టే చూడటం బొత్తిగా నచ్చిచావటం లేదు.

పెళ్లి చేసుకోబోననే కుచేలరావ్ భీష్మ ప్రతిజ్ఞని బ్రేక్ చేయాలని ఆఫీసులో తోటి సహాధ్యాయులంతా ఏకమై తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఈ నిజం కుచేలరావ్‌కీ తెల్సు!

ప్రశ్నా పత్రాలు లీక్ అయినట్టు తమ మనసులో ఆలోచన ముందుగానే కుచేలరావ్ ఎలా పసిగట్టగలిగాడా అని నివ్వెర పోతున్నారు కోలీగ్స్!

ఆఫీసులో వారి తలనొప్పి పడలేక ఏ రోగము లేకపోయినా హాస్పిటల్లో ఎడ్మిట్టై.. ఆఫీసుకు మెడికల్ పంపి లీవు శాంక్షన్ చేయమని కోరాడు.

హాస్పిటల్ నుండే సెల్‌లో మినిస్టర్ మామయ్యని కాన్టాక్ట్ చేసి తననెక్కడికైనా బదిలీ చేయించమని వేడుకున్నాడు.

వారం తిరక్కముందే.. అంటే .. హాస్పిటల్లో తాను బెడ్‌పై రెస్ట్ తీసుకుంటుండగానే..వైజాగ్ ట్రాన్స్ఫర్ ఆర్డరొచ్చేసింది.

ఎందుకూ? ఏమిటీ అని యక్ష ప్రశ్నలు వేయకుండా తనను బదిలీ చేయించి పుణ్యం కట్టుకున్నందుకు మామయ్యకి మనసులో థాంక్స్ తెల్పుకున్నాడు కుచేలరావ్.

అప్పటికి గాని కుచేలరావ్ మనసు కుదుట పడలేదు. తనకేగనుక ట్రాన్స్‌ఫర్ కాకపోతే ఆఫీసులో విలన్‌గాళ్లంతా ఏకమై ఏ దారే పోయేదాని మెడలోనైనా బలవంతాన తాళికట్టించి వుండేవారు. ఇప్పుడు వాళ్ల బెడద తప్పినందుకు సంతోషించాడు. పెళ్లి గండం నుంచి బైటపడ్డాడు.

ఆడవాళ్లంటే..ఊహ తెలిసినప్పటి నుండీ కుచేలరావ్‌కి ఓ విధమైన ఎలర్జీ! వాళ్ల ముఖం చూడాలన్నా... వాళ్లతో మాట్లాడాలన్నా ఇష్టం ఉండదు.

చిన్న తనంలో కూడా ఇరుగు పొరుగు ఆడపిల్లలతో పాటు అందరి కుర్రాళ్లకు మల్లే తొక్కుడు బిళ్ల ఆట ఆడటానికి ఎందుకో మనస్కరించేదికాదు.

క్లాసులో ఆడపిల్లలు కూర్చునే బెంచీమీద పొరపాటున కూడా కూర్చునే వాడు కాదు.

బహుశా అందుక్కారణం.. ఇంట్లో తనకు అక్కలుగాని చెల్లెళ్లుగాని లేకపోవటం కావచ్చుని తల్లిదండ్రులు సరి పెట్టుకున్నారు.

చాలా మంది మగాళ్లు ఆడపిల్లల మధ్య కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతుంటారు. చొల్లు కబుర్లు చెప్తూంటారు. అది కుచేలరావ్‌కి అస్సలు ఇష్టం ఉండదు.

కాలేజీ ఎడ్యుకేషన్ కూడా కో-ఎడ్యుకేషన్ లేని ఆర్ట్స్ కాలేజీ ఏరికోరి ఎంచుకుని జాయనయ్యాడు.

సర్వీసు కమీషన్ ఎగ్జామ్ రాసిన తనకు సెలక్షనొచ్చి ఓ పనికి మాలిన డిపార్ట్‌మెంట్‌కి తనను ఎలాట్ చేయటం జరిగింది.

తాను కొత్తగా ఉద్యోగంలో జాయినైన ఆఫీసులో సగానికిపైగా ఆడవాళ్లే కళ్లబడగానే కుచేలరావ్‌కి పై ప్రాణం పైనే పోయినట్టయింది.

ఓరి నాయనో... పోయి పోయి ముళ్ల కంపలో పడ్డానేంట్రో దేవుడాని పైకి తెలీకుండా మనసులో విలపించి నెత్తిబాదుకున్నాడు.

తానుగా లేడీ క్లార్క్స్‌తో మాట్లాడక పోయినా.. ఏదో వంకతో ఆడ గుమాస్తాలు తన చుట్టూ మూగేవారు. నవ్వుతూ కవ్వించే వారు. వారు తెచ్చుకున్న టిఫిన్‌బాక్స్‌ల్లోవి తననూ షేర్ చేసుకోమని బలవంతం చేసేవాళ్లు. సినీమా కబుర్లు చెప్పేవారు. జోక్స్ కట్ చేసే వాళ్లు.

ఇంత చేసినా తను పలక్కుండా మౌనం వహిస్తూ ఆడవాళ్లకి దూరంగా వుండటం చూచి... ఎగతాళి చేస్తూ నిక్‌నేమ్స్‌తో ఆటపట్టించటం చూస్తూ కుచేలరావ్ కుదేలై పోయేవాడు.

ఇదిట్లా ఉంటే.. మరో వైపు తాను లేడీ బాస్ (ఆఫీసర్) కింద పనిచేయాల్సి రావటం మరో శాపంగా పరిణమించింది. పని లేకపోయినా బాసు తననే రోజుకి పదిసార్లు చేంబర్లోకి

పిలిపించుకుని ఫైళ్ల గురించి డిస్కస్ చేయటం.. కామెంట్ చేయటం... మాని... సినిమా కబుర్లు చెప్పమని వేధించేది.

తనేమో అందంగా... ఎర్రగా.. ఎత్తుగా... నల్లటి కర్లీహెయిర్‌తో సినీమా హీరోలా వుంటాడాయె.

...బాసేమో నల్లగా తారుడబ్బాలా వుంటుంది. ఎత్తుపళ్లు... మామిడిపళ్ల గంపంత వళ్లు... చూట్టానికే అసహ్యంగా, భయంకరంగా వుంటుంది. పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చే రూపం! ఆమెను చూస్తూ జడుసుకోని రోజంటూలేదు.

ఆమె కబంధ హస్తాల నుండి తప్పించమంటూ ఆంజనేయస్వామి గుడికెళ్లి ప్రదక్షిణలు చేస్తూ..దండకం చదువుతూ.. ప్రతి శనివారం టెంకాయ కొట్టి... కోరేవాడు..

ఆడబాస్ పెట్టే బాధలు తప్పించుకోలేక నానాయాతన పడాల్సి వచ్చేది. ఒక వైపు లేడీ కోలిగ్స్... మరో వేపు లేడీ బాసు... పీక్కు తినసాగారు.

వీళ్ల పీడవదిలించుకోవాలంటే... ఉద్యోగాన్నే వదులు కోవలసివస్తుందా ఏమిటి ఖర్మ అన్పించేది.

ఏనాడో చేసుకున్న మహా పాపం ఇలా పట్టిపీడిస్తోందా అన్పించేది.

గవర్నమెంట్ ఉద్యోగమంటే బంగారు బాతు! పనిచేసినా చెయ్యక పోయినా మామూళ్లతో బాటు నెలతిరిగే సరికి ఠంచన్‌గా జీతం జేబులో కొస్తుంది. సీర్వసు పూర్తై రిటైరవగానే... పింఛను తోకాడించుకుంటూ కుక్కలా వెంటే వుంటుంది.

కాబట్టి...ఉద్యోగాన్ని వదులుకోటం తెలివి తక్కువగా తోచింది కుచేలరావ్‌కి.

తర్వాత ఏడాది తన వేలు విడిచిన మేనమామ ఎలక్షన్లో గెలిచి మినిస్టరవటంతో తన మార్గం సుగమమై కష్టాలు తప్పాయి. మేనమామ దయ వల్ల ఆడ చీడపీడ లేని మరో వింగ్‌కి బదిలీ అవటంతో బతుకుజీవుడా అని అనుకున్నాడు.

కొత్తగా రిపోర్ట్ చేసిన చోట ఆడ పురుగు మచ్చుకైనా లేకపోవటం చూచి తన అంతటి అదృష్టవంతుడు వేరొకరు వుండరన్పించింది.

కొద్ది రోజులు బాగానే మనశ్శాంతితో గడిచింది. ఆ తర్వాత మగ గుమస్తాలంతా ఏకమై తనకు పెళ్లి జరిపించాలని అనేక ప్లాన్లు వేయటం చూచి బిత్తరపోయాడు.

ఈ న్యూసెన్స్ దూరం చేసుకోవటానికి మళ్లా మామయ్యే కావలసి వచ్చాడు.

వీళ్ల బాధ తప్పించుకోవటానికే ఇప్పుడు వైజాగ్ బదిలీ చేయించుకోవలసిన దుర్గతి పట్టింది కుచేల్‌రావ్‌కి.

వైజాగ్ లైఫ్ హాయిగానే వుంది కుచేల్‌రావ్‌కి. వారినికోమారు సముద్రస్నానం. ఎత్తైన రోడ్లు. అప్పుడప్పుడు తారసపడే విదేశీయులు... తరచు రాజకీయ నాయకుల సభలు..సాహితీ

సమావేశాలు..కావాలనుకునే వారికి దొరికే విదేశీ మద్యం (నిజమనుకునేరు... అంతా డూప్లికేట్ సరుకే)...అలరించే చక్కని వాతావరణం...వైజాగ్ శానా బోలెడు నచ్చింది కుచేల్‌రావ్‌కి.

కొత్తగా వచ్చి రిపోర్ట్ ఇచ్చిన వాడు కావటాన తన జోలికెవరూ రావటం లేదు. తనూ రిజర్వ్‌డ్‌గానే వుంటున్నాడు. తన గురించి ఎవరైనా వివరాలు అడిగితే తనకింకా పెళ్లి కాలేదనే విషయాన్ని గోప్యంగా ఉంచుతూ మాట్లాడుతున్నాడు.

అఫీస్‌కి దగ్గర్లో కన్వీనియంట్ హౌస్ అద్దెకి తీసుకుని పేరెంట్స్‌ని వైజాగ్ షిఫ్ట్ చేశాడు.

పేరెంట్స్‌కి ఆశాదీపం కుచేలరావ్ ఒక్కడే! తండ్రికి వయసు డెబ్బై దాటటంతో కంటి చూపు మందగించింది. పళ్లూడి పోయినయ్. ఇక తల్లి విషయానికొస్తే ఆమెకి ఆస్తమా! ఎగశ్వాస దిగశ్వాసతో రోజు బాధపడుతూంటుంది.

పెళ్లి అంటే తనలో చెప్పలేనంత అయిష్టత కలగటానికి కారణాలు తెలుసుకుందామనే ఆసక్తితో ఓ ప్రముఖ సైకాలజిస్ట్‌ని కలిసాడు కుచేలరావ్.

డాక్టర్ మహాశయుడు ఫామిలీ చరిత్ర అంతా క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని...వంద ప్రశ్నలు వేసి...పది పరీక్షలు నిర్వహించి... చివరికి వ్యాధి ఏమీలేదని క్లీన్ చిట్ ఇచ్చాడు కుచేల్‌రావ్‌కి. కాకపోతే ఇదొక రకమైన ఫోబియా అంటూ ..ఇలాంటి కేసుల్లో ఫోబియా దూరమవటానికి ఓ పాతిక ప్రాథమిక సూత్రాలు చెవిలో రహస్యంగా చెప్పాడు.

డాక్టర్ ఫీజిచ్చి బతుకుజీవుడాని నర్సింగ్‌హోమ్ లోంచి బైటపడిన కుచేలరావ్ భవిష్యత్ కార్యక్రమం ఏమిటో తోచక బుర్ర గోక్కున్నాడు.

"డాక్టరేమన్నాడురా కుచేలా?" తండ్రి ప్రశ్నించాడు.

"నాకు రోగమే లేదన్నాడు" చెప్పాడు.

"ఎందుకు అట్లా విసుక్కుంటావ్?" - హు! ఏం చేస్తాం...? మేం బ్రతికుండగా నీ పెళ్లి చూచే యోగం లేదు"-నిట్టూర్చాడు తండ్రి వెంకటయ్య.

"పెళ్లి పెళ్లి అనేసి మనం ఆరాటపడటమేకానీ వాడికి చీమ కుట్టినట్లయినా లేదు" పక్కనే వున్న తల్లి సుబ్బమ్మ వగర్చింది.

"నా పెళ్లియావ తప్ప మరోధ్యాసే లేదా మీకు?..."

"అవున్రా! ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరిగితేనే బావుంటుంది. నలభైయేళ్లు వచ్చాక నిన్నెవత్తి చేసుకుంటుంది?" - బాధగా మాట్లాడింది సుబ్బమ్మ.

"మనం ఎంత వాగినా వాడు మారడు. ఇంతకూ మన వంశం వృద్ధిలోకి వచ్చే యోగం లేదేమోలే..." వెంకటయ్య బాధగా అన్నాడు.

"పెళ్లి... సంసారం... పెళ్లనే... లంపటి లేకుండా నన్ను వంటరిగా హాయిగా బతకనీయండి..." అల్టిమేటం జారీ చేసినట్లు జవాబిచ్చి తన రూములోకెళ్లాడు కుచేలరావ్,

ఆర్నెల్లు గడవగానే కుచేలరావ్ వర్కు చేస్తున్న ఆఫీసులో బాస్ ట్రాన్స్ఫర్ మీద వెళ్లి పోవటం వల్ల కొద్ది రోజులు ఆఫీసర్ పోస్టు వేకెంట్‌గా వుంది.

'బాస్'లేక పోవటంతో ఆఫీసులో వారికి పట్టపగ్గాల్లేకుండా పోయినయ్. ఇష్టారాజ్యంగా మారింది. ఎవరికి ఎవరిమీదా కంట్రోల్ ...డిసిప్లిన్ లేకుండా పోయింది.

రోటిన్ ఆఫీస్ వర్కు ఆగిపోయింది. ట్రాఫిక్ జామ్ అయినట్టు ఫైళ్లన్నీ పేరుకున్నాయ్. ఆఫీసు చుట్టూ తిరిగి పోయే ప్రజలు లబోదిబో మంటున్నారు. పనులు కావడంలేదని తిట్టుకుంటున్నారు.

ఓ నెల్లాళ్లు గడిచేక మిస్ జాంబవతి మేడమ్‌ని లాంగ్‌స్టాండింగ్ బదిలీ నెపంతో హైదరాబాద్ నుండి వైజాగ్ పోస్ట్ చేశారు.

జాంబవతి మేడమ్ మళ్లీ ఆఫీసరుగా వైజాగ్ రాబోతోందన్న విషయం తెలుసుకున్న కుచేలరావ్ గొల్లుమన్నాడు. రమేశ్వరం పోయినా శనేశ్వరం తప్ప లేదన్నట్టు.. ఆమె బారి నుండి.. కంబధ హస్తాల నుండి తప్పించుకోవాలని మామయ్యతో చెప్పి వైజాగ్ బదిలీ చేయించుకుంటే.. తన వేనకాలే ఆమె (బాస్) కూడా మళ్లీ ఇక్కడికే ఆఫీసర్‌గా రావటం... నిజంగా తన పాపఖర్మమే అన్పించింది.

ఆమెతో వేగలేక..తాను ఆత్మహత్య చేసుకోక తప్పదనే బాధ గుండెల్లో ముల్లులా గుచ్చుకుంది.

ఇంటికొచ్చి కన్నవారికి విషయమేమిటో వివరంగా చెప్పకుండా కస్సు బుస్సుమంటూ ఆయన దానికి కానిదానికి మండి పడటం చూస్తూ "విడికే దయ్యమో..భూతమో ఆవహించింది. భూతవైద్యుడ్ని పిలిపించి రోగం కుదురుస్తే గాని దారిలోకి రాడు" అంది తల్లి.

"ఇంకా నయం.. నాకు పిచ్చెక్కిందని...కింగ్ జార్జి హాస్పిట్‌లో చేరమన్లేదు.." రెచ్చిపోయి మాట్లాడాడు.

ఇంట్లో పరిస్థితి ఈ తీరుండగా... ఆఫీసులో బాస్ రిపోర్ట్ చేసిన మరుక్షణమే తానిక్కడే పనిచేస్తున్నట్లు అటెండెన్స్ రిజిష్టర్‌లో పేరు చూచి క్షణాలమీద ఆమె చాంబర్లోకి ప్యూన్ ద్వారా పిలిపించుకుంది.

వాంతి చేసుకున్న వాడిలా ముఖం పెట్టిన కుచేలరావ్ పిల్లిలా ఆమె (బాస్) ఎ.సి.రూమ్‌లో అడుగు పెట్టాడు.

'కమాన్.. కమాన్... మై స్వీట్ హార్ట్ నన్ను తప్పించుకోవాలని దూరం వచ్చావ్! ఎలా వుంటున్నావ్?-మేరేజైందా?.." సాదరంగా ఆహ్వానం పలికి కాల్‌బెల్ నొక్కి ప్యూనుగాడిని అర్జంటుగా రెండు కూల్‌డ్రింక్స్ తెమ్మంది.

చచ్చాన్రా దేవుడా... ఇక ఈ శంఖిణి వదలదు కాబోలు!... నన్ను నంజుకు తినటం ఖాయం!... అనుకున్నాడు లోలోపలే!..

"నీ లాంటి హేండ్సమ్ ఫిగర్ నిలబడితే నాకు బాధగా వుంటుంది కూర్చో..." అంది బాస్ జాంబవతి.

కూర్చోకపోతే లేచొచ్చి ఎత్తుకెళ్లి ఎక్కడ కుర్చీలో కుదేస్తుందేమోనన్న భయంతో బిక్కు బిక్కు మంటూ జంకుతూ వెళ్లి ఛైర్లో తలొంచుకూర్చున్నాడు.

ఇంతలో ప్యూను పక్షి డ్రింక్స్ తెచ్చి పెట్టి వెళ్లి పోయాడు.

"డ్రింకు తీసుకో డియర్!..." ప్రేమ వొలకబోస్తూ బాటిల్ అందించింది.

కుచేల్‌రావ్ భయంతో వణికిపోతున్నాడు. భయం భయంగా సీసా అందుకుని వంచిన తల ఎత్తకుండా సిప్ చేస్తున్నాడు.

"చూడు కుచేల్‌రావ్! కొన్ని జీవితాలింతే! ఆ దేవుడు ఒకరికొకరు ఎప్పుడో రాసి ఉంటాడు. మనిద్దరం మేడ్ ఫర్ ఈచదర్.. కదూ?!" అంది పళ్లన్నీ కన్పించేలా ఇకిలిస్తూ!

ఆ మాటలు వింటున్న కుచేలరావ్‌కి నిలువు గుడ్లు పడినయ్. మనసు బాధతో మూలిగింది. లేచి వెళ్లిపోబోయాడు.

"చూడు కుచేలా!.." నన్ను విడిచి నీవు పోలేవులే.. ఇదీ నిజములే.." అంటూ సినిమా పాట పాడటం మొదలుపెట్టింది జాంబవతి!

"వామ్మో?... వారినాయనో.. నాకీ ఉద్యోగమూ వద్దూ....నీతో పెళ్లి వద్దంటూ" గబాలున ఎ.సి.రూమ్‌లోంచి బైటకొచ్చి వెనక్కి తిరిగి చూడకుండా ఒకటే పరుగు.

ఇదండీ!.... పాపం... నేటి పూర్‌ఫెలో కుచేలరావ్ కథ!

-: సమాప్తం :-

(27,28,29 జనవరి 2009 ఆంధ్రప్రభ దిన పత్రికలలో...)